క్లుప్తంగా

విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలి



భీమవరం(వత్సవాయి): పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచాలని మండల విద్యాశాఖాధికారి ఎల్.నాగరాజు సూచించారు. గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు సంఖ్య, బోధన తీరు, జగనన్న విద్యాకానుక పంపిణీ, బయోమెట్రిక్ హాజరు గురించి వాకబు చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన విధంగా రుచికరమైన ఆహారాన్ని అందించాలన్నారు. పాఠశాలలో మొక్కలను పెంచి పచ్చదనానికి తోడ్పాటునందించాలని చెప్పారు. తరగతి గదులు ఆహ్లాదంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అజ్మీరు శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

నందిగామలో భారీ వర్షం



నందిగామ: నందిగామ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 6 గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. దాదాపు గంటకు పైగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఎక్కువ శాతం మంది ప్రజలు ఇళ్లకు వెళ్లే సమయం కావడంతో ఆ సమయంలో ఎక్కడి వారు అక్కడే నిలిచిపోవలసిన పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ సాగు ప్రారంభించవచ్చని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ముత్యాలమ్మకు బోనాలు



కె.అగ్రహారం(జగ్గయ్యపేట): మండలంలోని కె.అగ్రహారం గ్రామంలో ఉన్న ముత్యాలమ్మ అమ్మవారికి శుక్రవారం ఘనంగా బోనాలు సమర్పించారు. పొంగళ్లు తయారు చేసి ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వెండి చెంబు బహూకరణ



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయానికి శుక్రవారం గుంటూరు జిల్లా తాడికొండ మండలం బడేపురం గ్రామానికి చెందిన సిరిపురపు గోపీచంద్ 216 గ్రాముల వెండి చెంబును ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ జంగం ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



కంచికచర్ల: ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను బైక్ ఢీకొనటంతో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం మండలంలో జరిగింది. ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు మండలంలోని పరిటాల క్రషర్‌లో కూలీగా పనిచేసే వ్యక్తి క్వారీలో నుంచి కంచికచర్లకు బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొని తీవ్రగాయాలయ్యాయి. అదే సమయంలో అటువైపుగా వస్తున్న ఎస్ఐ సుబ్రహ్మణ్యం తక్షణమే 108 అంబులెన్స్ వాహనానికి సమాచారం అందించి క్షతగాత్రుడిని దగ్గరుండి చికిత్స కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని అక్కడున్న తోటి వారు పట్టుకోకపోవటంతో ఎస్ఐతో పాటు హోంగార్డు రోజారావు ఆ వ్యక్తిని అంబులెన్స్‌లోకి ఎక్కించారు. ఇది చూసిన ప్రయాణికులు, వాహనదారులు ఎస్ఐతో పాటు హోంగార్డు రోజారావులను అభినందించారు.

దేశానికే ఆదర్శంగా వలంటీర్ వ్యవస్థ

వలంటీర్లను సత్కరించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన వలంటీర్, సచివాలయ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని శాసన సభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. చందర్లపాడు మండలం పొక్కునూరు గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రతిభ చూపిన వలంటీర్లను సత్కరించి పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ వలంటీర్లు అందిస్తున్న సేవలు శ్లాఘనీయమన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థ ఎంతో కీలకంగా మారిందని, ప్రతి కుటుంబంలోని అర్హులను గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించటం, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉందన్నారు.

వలంటీర్ వ్యవస్థతో గడప వద్దకే పాలన..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థతో ప్రజల గడప వద్దకే పాలన తీసుకువచ్చారని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు అన్నారు. గతంలో మాదిరిగా పథకాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా వలంటీర్లే అర్హులను గుర్తించి పథకాలు దరఖాస్తు చేయటంతో పాటు పథకాలను కూడా ఇళ్ల వద్దకే తీసుకువచ్చి అందిస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వాల హయాంలో రేషన్ బియ్యం తీసుకోవాలన్నా, అవ్వాతాతలు పింఛన్ పొందాలన్నా ఎన్ని వ్యయ ప్రయాసలు పడాల్సి వచ్చేదో ప్రతి ఒక్కరికీ తెలుసని గుర్తు చేశారు. ముఖ్యంగా కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి వలంటీర్లు అందించిన సేవలు మరువలేనివన్నారు. వలంటీర్లు అందిస్తున్న సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పురస్కారాలతో వారిని సత్కరిస్తున్నారని జగన్‌మోహనరావు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కన్వీనర్ కొమ్మినేని మహేంద్ర, మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు కటుకూరి వెంకటరత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, రాయల జానకిరామయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

200 మంది రైతులకు రూ.60 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీ



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న రైతులు

నందిగామటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. చందర్లపాడు మండలం పొక్కునూరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం ఎమ్మెల్యేను రైతులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ఏడాది సాంకేతిక కారణాల వల్ల పలువురు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సంబంధిత శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ముఖ్యమంత్రి ఇన్‌పుట్ సబ్సిడీ పొందని 200 మంది రైతుల ఖాతాలలో రూ.60 లక్షలను జమ చేశారని తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో ఇన్‌పుట్ సబ్సిడీ ఎప్పుడు వస్తుందో తెలియదని, సీఎం జగన్ హయాంలో ఎన్నడూ లేని విధంగా ఏ సీజన్‌లో పంట నష్టపోతే అదే సీజన్‌లో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తున్నారని గుర్తు చేశారు.

ఎమ్మెల్యే కృషి మరువలేనిది..

గతేడాది ఇన్‌పుట్ సబ్సిడీ అందకపోవటంతో ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు విన్నవించామని, వెంటనే స్పందించిన ఆయన అధికారులతో కలిసి పంట నష్టం, నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారని పలువురు రైతులు చెప్పారు. ఎమ్మెల్యే జగన్‌మోహనరావు కృషి వల్లనే 200 మంది రైతులకు మేలు జరిగిందని ప్రశంసించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి రైతులు ఎమ్మెల్యే జగన్‌మోహనరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొమ్మినేని మహేంద్ర, కటుకూరి వెంకటరత్నం, కందుల నాగేశ్వరరావు, వైఎస్ఎన్ ప్రసాద్, రాయల జానకిరామయ్య పాల్గొన్నారు.

87 శాతం గృహాలకు మంచి చేసిన సీఎం జగన్

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



పొన్నవరంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పొన్నవరం(వీరులపాడు): రాష్ట్ర వ్యాప్తంగా 87 శాతం గృహాలకు సంక్షేమ పథకాల ద్వారా మంచి చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని పొన్నవరం గ్రామంలో శుక్రవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి సంక్షేమ పథకాలు అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా అవినీతికి ఆస్కారం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలకు సాధ్యం కాని రీతిలో సంక్షేమ పథకాల ద్వారా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో రూ.రెండు లక్షల కోట్లను నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాలలో జమ చేశారని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించటంతో పాటు గ్రామాలను సైతం పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నట్లు జగన్‌మోహనరావు తెలిపారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు మద్దతు పలికి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ షోడగిరి రాజశ్రీ, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, నాయకులు షోడగిరి సతీష్, పలువురు నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బంగారం, వెండి నగలు అప్పగింత



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో భక్తులు కానుకగా సమర్పించిన వెండి, బంగారు నగలను గతంలో ఇక్కడ ఈఓగా పనిచేసి ప్రస్తుతం మచిలీపట్నంలో బాధ్యతలు నిర్వహిస్తున్న ఈఓ లీలాకుమార్ నూతనంగా అమ్మవారి ఆలయ ఈఓగా బాధ్యతలు చేపట్టిన కె.రమేష్‌నాయుడుకు శుక్రవారం అప్పగించారు. ఆలయ ఆవరణలో సీసీ కెమెరాలు, హోంగార్డులు, ఆలయ సిబ్బంది పర్యవేక్షణలో నగలను సరిచూశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఏఈఓలు ఉమాపతి, తిరుమలేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

అల్లూరు(వీరులపాడు): ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. సేకరించిన సమాచారం మేరకు మండలంలోని చట్టన్నవరం గ్రామానికి చెందిన కోట ప్రమీల నందిగామలో ఆరోగ్య మిత్రగా పని చేస్తున్నారు. రోజూ మాదిరిగానే శుక్రవారం కూడా విధులు ముగించుకుని నందిగామ నుంచి స్కూటీపై తన స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో అల్లూరు గ్రామం వద్దకు వచ్చేసరికి పెద్దాపురం గ్రామం నుంచి కంచికచర్ల వైపు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనం అతి వేగంగా వచ్చి ప్రమీల వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రమీల తలకు తీవ్ర గాయాలు కావటంతో సమాచారం అందుకున్న అల్లూరు పీహెచ్‌సీ సిబ్బంది ప్రథమ చికిత్స నిర్వహించి హుటాహుటిన 108 వాహనంలో నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయం కావటంతో పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారని కుటుంబ సభ్యులు చెప్పారు.

కేవీకేను సందర్శించిన ఇథియోపియా బృందం



కేవీకేలో పెంచుతున్న కోళ్ల వివరాలను తెలుసుకుంటున్న ఇథియోపియా బృంద సభ్యులు

గరికపాడు(జగ్గయ్యపేట): గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)ను శుక్రవారం ఇథియోపియా బృందం సందర్శించింది. ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం సంచాలకుడు ముకుందరావు ఆధ్వర్యంలో కేవీకేలోని వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి క్షేత్ర విషయాలను శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. ముకుందరావు మాట్లాడుతూ కేవీకేలో జరుగుతున్న వ్యవసాయ క్షేత్ర స్థాయి విషయాలను, రైతులకు అందిస్తున్న సేవల గురించి బృంద సభ్యులకు వివరించామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల పనితీరును రైతులను అడిగి తెలుసుకున్నారని తెలిపారు. అనంతరం క్షేత్ర స్థాయి వివరాలను పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా వివరించామని చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శివప్రసాద్, జీఎంవీ ప్రసాదరావు, రాజశేఖర్, లక్ష్మీకళ, మహీందర్ రెడ్డి, రాజనరసింహ తదితరులు పాల్గొన్నారు.

వివిధ అంశాలపై ఆర్డీఓతో ప్రభుత్వ విప్ సమీక్ష



ఆర్డీఓతో చర్చిస్తున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

నందిగామ: జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేసుకునేలా అధికారులు సహకరించాలని జగ్గయ్యపేట శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సూచించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఆర్డీఓ ఎ. రవీంద్రరావుతో జగ్గయ్యపేట నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, సమస్యలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న కాలనీల పురోగతి, పలుచోట్ల ఎదురవుతున్న సమస్యలు, పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, నందిగామ మండల జెడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సిబ్బందితో ఆర్డీవో సమీక్ష

జగ్గయ్యపేట నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి శుక్రవారం సాయంత్రం నియోజకవర్గ పరిధిలోని పలు శాఖల సిబ్బందితో ఆర్డీఓ రవీంద్రరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానికంగా వచ్చిన ఏ సమస్య పైనైనా సిబ్బంది వెంటనే స్పందించాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ముఖ్యంగా జగనన్న కాలనీలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్షపై అవగాహన సమావేశం

కంచికచర్ల: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లు, గృహసారథులకు సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ కె.బాలశంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ హాజరుకానున్నారని పేర్కొన్నారు.

నేడు కౌలు వేలం పాటలు

మక్కపేట(వత్సవాయి): గ్రామంలో ఉన్న శ్రీ కాశీవిశ్వేశ్వర, రామాలయం, రాజగోపాల, వేణుగోపాల, అత్తిలి సారంగమఠంకు చెందిన వ్యవసాయ భూములకు ఒక ఏడాదికి కౌలు వేలంపాటలు నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ ఈవో సీహెచ్ హరిదుర్గా నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు రామాలయం ఆవరణలో వేలంపాటలు జరుగుతాయన్నారు. పాటలో పాల్గొనే వారు ముందుగా రూ.పది వేలు డిపాజిట్ చెల్లించాలని సూచించారు. వేలంపాటలో హెచ్చుపాటదారుడు పాట మొత్తాన్ని వెంటనే చెల్లించాలన్నారు. దేవదాయశాఖకు బకాయిలు ఉన్నవారు పాటలో పాల్గొనేందుకు అనర్హులని తెలియజేశారు. పై ఆలయాలకు సంబంధించి మొత్తం 77 ఎకరాల 75 సెంట్లకు పాట జరుగుతుందన్నారు.

రేపు ఉచిత కంటివైద్య శిబిరం

పెనుగంచిప్రోలు: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ ఆవరణలో ఈనెల 25న శంకర కంటి ఆసుపత్రి, పెదకాకాని, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శుక్రవారం నిర్వాహకులు తెలిపారు. శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ప్రారంభిస్తారన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే శిబిరానికి వచ్చే వారు తప్పక ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు తీసుకురావాలన్నారు.

అలరించిన పారుపల్లి ఆరాధనా సంగీతోత్సవాలు

విజయవాడ కల్చరల్: సంగీత సద్గురువులు సుసర్లదక్షిణామూర్తి, పారుపల్లి రామకృష్ణయ్య పంతులు ఆరాధనా సంగీతోత్సవాల సందర్భంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీత కార్యక్రమాలు భావరస గంగా ప్రవాహంలా సాగుతున్నాయి. చెంగల్వల రంజని గాత్రంతో శుక్రవారం కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. రాగంపూడి అమూల్య, హేమాద్రి చంద్రకాంత్, బీవీ దుర్గాభవాని, ద్రోణేంద్రఫణికుమార్ వేణుపై ఆకాశవాణి నిలయ విద్వాంసురాలు బీవీ దుర్గాభవాని వాగ్గేయకారుల కీర్తనలను ఆలపించారు. కార్యక్రమంలో వాయిద్య సంగీత కళాకారులు సద్గురు చరణ్, పెరవలి నందకుమార్, గజ్జెల సతీష్‌బాబు, జగన్మోహిన పాల్గొన్నారు. నిర్వాహకుడు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ 25వ తేదీ ఆదివారం ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు సంగీత ఉత్సవాలు జరుగుతాయని ఉదయం పంచరత్న కీర్తనల గోష్ఠిగానం ఉంటుందని తెలిపారు.

సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఉదయభాను



చిల్లకల్లు ఎంపీడీవో కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో ఉదయభాను

చిల్లకల్లు(జగ్గయ్యపేట): రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లి నుంచి ప్రారంభించారు. దీనికి సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో శుక్రవారం ఉదయభాను పాల్గొన్నారు. జూలై ఒకటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న సురక్ష ప్రారంభమవుతుందన్నారు. గ్రామాలలోని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. నెల రోజుల పాటు కార్యక్రమం జరుగుతుందన్నారు. అధికారులు కూడా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సాంబశివరావు, కేడీసీసీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, విజయవాడ దుర్గమ్మ ఆలయ పాలకవర్గ సభ్యుడు నంబూరి రవికుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

చిల్లకల్లులో త్వరలో ట్రామాకేర్ సెంటర్ పనులు



ట్రామాకేర్ సెంటర్ స్థలాన్ని పరిశీలిస్తున్న విప్ ఉదయభాను

చిల్లకల్లు(జగ్గయ్యపేట)/వత్సవాయి: గ్రామంలోని చిల్లకల్లు టోల్‌ప్లాజా సమీపంలో కొద్దిరోజుల్లో ట్రామాకేర్ సెంటర్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. గ్రామంలోని జాతీయ రహదారి పక్కనున్న 10 ఎకరాల స్థలాన్ని అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని క్షతగాత్రులకు పూర్తి స్థాయిలో చికిత్స అందించలేకపోతుండటంతో మృతి చెందుతున్నారన్నారు. ట్రామా కేర్ సెంటర్ వల్ల రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారికి పూర్తి స్థాయి వైద్యమందుతుందని తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లటంతో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారని చెప్పారు. కేంద్రంలో అత్యాధునిక పరికరాలతో పాటు 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. అంతేకాకుండా సమీపంలోని స్థలంలో కూడా జగనన్న కాలనీ నిర్మాణానికి ఎనిమిది ఎకరాల స్థలాన్ని కేటాయిస్తున్నామని చెప్పారు. రెండెకరాలలో వత్సవాయి మండల రెండవ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఇటీవల వైద్య విధాన పరిషత్ అధికారులు కూడా స్థలాన్ని పరిశీలించారని మరి కొద్ది రోజుల్లో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వైకుంఠరావు, కేడీసీసీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైద్యాధికారి సుష్మ ప్రియదర్శిని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భవానీ ప్రసాద్, శేషం ప్రసాద్, నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

కోనేరు ప్రాంతాన్ని పరిశీలించిన తహసీల్దార్



తహసీల్దార్‌కు కోనేరుకు సంబంధించిన సమాచారం తెలియజేస్తున్న ఆలయ ఈవో

నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారికి చెందిన కోనేరు ప్రాంతాన్ని శుక్రవారం తహసీల్దార్ నరసింహారావు పరిశీలించారు. కోనేరు ప్రాంతం ఆక్రమణలకు గురికావడంతో ఇటీవల పలు ఆక్రమణలను తొలగించిన సంగతి పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతం మొత్తాన్ని సర్వే నిర్వహించి కోనేరుకు పూర్వ వైభవం తెచ్చేందుకు దేవదాయ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. సర్వే అధికారులతో కలిసి తహసీల్దార్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. దేవదాయ శాఖ ఈవో సీతారామయ్యను అడిగి కీలక సమాచారాన్ని సేకరించారు.

జేఈఈ ర్యాంకర్‌కు అభినందన



నిఖిల్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో కొండపల్లికి చెందిన రాగాల నిఖిల్ జాతీయ స్థాయిలో ఎస్టీ విభాగంలో 317 ర్యాంకు సాధించిన సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు స్వగృహంలో శుక్రవారం విద్యార్థిని సత్కరించినట్లు డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ తెలిపారు. నిఖిల్‌ను పీసీసీ ఉపాధ్యక్షుడు మురళీ మోహనరావు, జిల్లా అధ్యక్షుడు కిరణ్, పీసీపీ కార్యదర్శి ఏసుదాస్ అభినందించారు.

యువకుడి అసభ్య ప్రవర్తనపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టినగర్ టైలర్‌పేటకు చెందిన ఓ బాలిక (13) చిట్టినగర్‌లోని ఓ ప్రయివేటు స్కూల్లో 8వ తరగతి చదువుతోంది. 22వ తేదీ గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో బయటకు వెళ్లి ఇంటికి వస్తోంది. అదే సమయంలో ఇంటి యజమాని కుమారుడు రమణారావు బాలిక వెనుక నుంచి వచ్చి అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె కేకలు వేసింది. రమణారావు పారిపోవడంతో బాలిక విషయాన్ని తల్లికి చెప్పింది. దీంతో ఘటనపై తండ్రి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

నేత్రదానం



మాగం రాజేష్(ఫైల్)

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు మాగం రాజేష్(41) గుండె పోటుతో శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, పలువురు పార్టీ నాయకులు రాజేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. చురుకైన కార్యకర్తగా ఉన్న రాజేష్ మృతి బాధాకరం అని ఎమ్మెల్యే అన్నారు. రాజేష్ నేత్రదానం చేయడంతో తెలంగాణ రాష్ట్రం ఖమ్మంకు చెందిన ఐ బ్యాంకు వారు వచ్చి మృతుని కంటి శుక్లాలను తీసుకునివెళ్లారు.

మత్తుపదార్థాలతో జీవితం అంధకారం

కంచికచర్ల: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే జీవితంలో ఉన్నతమైన స్థానాన్ని దక్కించుకుంటారని, లేకపోతే జీవితాల్లో అంధకారమే మిగులుతుందని నవజీవన్ బాలభవన్ ట్రస్టు జిల్లా కో ఆర్డినేటర్ మేరుగ రత్నం అన్నారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం స్థానికంగా పలు విద్యా సంస్థల్లో విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు.